క్లుప్తంగా

నేడు, రేపు చిట్టబ్బాయి జయంతి, వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

అమలాపురం టౌన్: పట్టణంలోని స్థానిక హైస్కూలు సెంటరులో మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి జయంతి, మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పాల్గొంటారని చెప్పారు. అలాగే నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు విధిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పందిరి రాట ముహూర్తం


దుడ్డివారి అగ్రహారంలో పందిరి రాట ముహూర్తం నిర్వహిస్తున్న యువకులు

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలో బాల గణపతి విద్యార్థి సంఘం ప్రతినిధులచే గణపతి నవరాత్ర ఉత్సవాలకు శనివారం ఉదయం పందిరి రాట ముహూర్తం నిర్వహించారు. గత 60 ఏళ్లుగా నవరాత్ర ఉత్సవాలను అగ్రహారం ప్రజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధాకొండ అన్నారు. కార్యక్రమంలో దుడ్డివారి అగ్రహారం యువకులు మంగళంపల్లి ప్రదీప్, అడబాల బుజ్జి, పోలిశెట్టి బాబి, కొత్తపల్లి వంశీ, కొమ్మన బాలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఇన్వెర్టర్ బహూకరణ


సమనస గురుకుల పాఠశాలకు ఇన్వెర్టర్ అందిస్తున్న దాత శ్యామ్

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలకు పి.గన్నవరం మండలం ఉడుమూడికి చెందిన ప్రవాస భారతీయుడు గిడ్డి శ్యామ్ రూ.25 వేల విలువైన ఇన్వెర్టర్‌ను బహూకరించారు. ప్రిన్సిపాల్ వైటీఎస్ రాజు సమక్షంలో శనివారం పాఠశాలకు అందచేశారు. దాత శ్యామ్‌కు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏటీఎస్ ప్రతాప్, ఉపాధ్యాయులు బళ్ల రవికుమార్, వెంకటేశ్వరరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అమలాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండం కారణంగా గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని పర్యవేక్షించేందుకు అమలాపురం డివిజన్ స్థాయిలో 24 గంటలు పని చేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన 94409 04477 సెల్ నంబర్‌కు వినియోగదారులు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

బాడ్మింటన్ క్రీడాకారుడికి సత్కారం

యానాం: స్థానిక బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ క్రీడాకారుడు కర్రి నూకేష్ వర్మ స్పోర్ట్స్ కోటాలో రైల్వే ఉద్యోగానికి ఎంపిక కావడంతో ఆయనను క్లబ్ వ్యవస్థాపకుడు కాపగంటి అనురాగ ఆదర్శ శేష సుమన్, కోచ్ బొట్టా శ్రీనివాస్‌లు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేద విద్యార్థుల్లో ఉండే క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలనే లక్ష్యంతో కొన్నేళ్ల క్రితం యానాం బ్యాడ్మింటన్ క్లబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. సత్కార సభలో సీనియర్ క్రీడాకారులు రాయపురెడ్డి విజయ్, ఎడ్ల శాంతి, మల్లాడి చినబాబు, నరేష్, వీరబాబు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైనతేయ తీరంలో గరుత్మంతుడి విగ్రహం


అప్పనపల్లిలో దాత కుటుంబ సభ్యులు ఆవిష్కరించిన గరుత్మంతుడి విగ్రహం

మామిడికుదురు: ప్రముఖ పుణ్య క్షేత్రం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి స్నానఘట్టం వద్ద దాతల విరాళం రూ.రెండు లక్షలతో నిర్మించిన గరుత్మంతుడి విగ్రహాన్ని శనివారం ప్రారంభించారు. ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందిన దాత చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యుల విరాళం రూ.2 లక్షలతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దాత కుటుంబ సభ్యులతో విగ్రహావిష్కరణను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు.. స్తంభించిన జన జీవనం

- దాదాపుగా ఇళ్లకే పరిమితమైన ప్రజలు
- మూతపడిన విద్యాలయాలు, అరకొరగా తెరుచుకున్న దుకాణాలు

అమలాపురం టౌన్: గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో జనజీవనం స్తంభించింది. అమలాపురం పట్టణం, ముమ్మిడివరం నగర పంచాయితీ, మిగిలిన మండల కేంద్రాల్లో దుకాణాలు అరకొరగా తెరుచుకున్నాయి. ప్రజలు దాదాపు ఇళ్లకే పరిమితమయ్యారు. అసలే సీజనల్ వ్యాధులు, జ్వరాలతో ఆందోళనగా ఉన్న ప్రజలకు ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో హడలెత్తారు. దీంతో రోడ్లన్నీ ఖాళీ దర్శనమివ్వడంతో పాటు దుకాణాలు అంతంతమాత్రంగానే తెరుచుకున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య వర్షాల కారణంగా పలచపడింది. మరోవైపు భారీ వర్షాల కారణంగా శనివారం విద్యాలయాలకు సెలవు ప్రకటించారు.

పల్లపు ప్రాంతాల జలమయం

ఉప్పలగుప్తం మండలంలో 85.8 మిల్లీ మీటర్లు, అల్లవరం మండలంలో 72.6 మి.మీ., ఐ.పోలవరం మండలంలో 68.2 మి.మీ, కాట్రేనికోన మండలంలో 65.6 మి.మీ., ముమ్మిడివరం మండలంలో 58.6 మి.మీ, అమలాపురం మండలంలో 54.4 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు పల్లపు ప్రాంతాలు, కాలనీలు జలమయమయ్యాయి.


వర్షాల కారణంగా వెలవెలబోతున్న అమలాపురం పట్టణంలోని బ్యాంక్ స్ట్రీట్ రోడ్డు


భారీ వర్షాలకు నీట మునిగిన ఓడలరేవులోని అంబేడ్కర్ కాలనీ

రోడ్లు దెబ్బతిని అసౌకర్యంగా మారాయి. అమలాపురం, ముమ్మిడివరం, అల్లవరం మండలాల్లో పంటల ముంపు సమస్య లేకున్నా డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. అమలాపురం పట్టణంలో పలు పల్లపు ప్రాంతాలు ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి ఈదరపల్లి రోడ్డు, అశోక్‌నగర్, కుంకుల సందు తదితర ప్రాంతాల్లో కొన్ని చోట్ల ముంపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. పలు గ్రామాల్లో కొన్ని ఇళ్లలో జరుగుతున్న శుభకార్యాలకు వర్షం అవరోధంగా నిలిచింది. కొన్ని చోట్ల వేడుకలను వర్షాల వల్ల వాయిదా వేసుకున్నారు. ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో పంట చేలు పలు చోట్ల ముంపునకు గురయ్యాయి. వినాయక చవితి నవరాత్ర ఉత్సవాలు, పర్వదినాలు త్వరలో జరగనున్న క్రమంలో మార్కెట్‌లో ముఖ్యంగా వస్త్ర దుకాణాలకు బేరసారాలు బాగుంటాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వినియోగదారుల తాకిడి లేక వస్త్ర దుకాణాలు కూడా వెలవెలబోయాయి. అమలాపురం మున్సిపాలిటీ, ముమ్మిడివరం నగర పంచాయితీలో వర్షాల తాకిడితో ఈ రెండు చోట్లా ప్రధాన మార్కెట్లు కూడా అంతంత మాత్రంగానే సాగాయి.

భారీ వర్షాలకు కాలనీల మునక

అల్లవరం: రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు, డ్రైనేజీలు వర్షపు నీటిలో దర్శనమిస్తున్నాయి. భారీ వర్షాలకు కాలువలు, డ్రైన్లు ముంపు నీటితో నిండిపోవడంతో అనేక కాలనీల్లో వర్షపు నీరు దిగే మార్గాలు కరవయ్యాయి. బోడసకుర్రు పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ కాలనీ, ఓడలరేవులోని అంబేడ్కర్ నగర్‌లో ముంపు నీరు భారీగా చేరుకుంది. దేవగుప్తం ఉన్నత పాఠశాల ఆవరణను వర్షం నీరు ముంచెత్తింది. రెండు రోజుల భారీ వర్షాలకు కాలనీలు నీట మునుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని, మురుగునీరు పారేందుకు సహాయక చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా విద్యాసాగర్


అధ్యక్షుడిగా ఎన్నికైన విద్యాసాగర్‌ను సత్కరించిన మల్లాడి కృష్ణారావు

యానాం: యానాం కో ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడిగా రిటైర్డ్ ఉద్యోగి లంక విద్యాసాగర్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక యర్రాగార్డెన్స్‌లో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్యానల్ సమావేశంలో సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా న్యాయవాది కమిడి విజయకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యాసాగర్, విజయకుమార్‌లు మాట్లాడుతూ సభ్యుల సహకారంతో సొసైటీని మళ్లీ లాభాల బాట పట్టించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం సంఘం సభ్యులు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ పాల్గొన్నారు.

సెమీ ఫైనల్స్ అనడం హాస్యాస్పదం

యానాం: యానాం కో ఆపరేటివ్ స్టోర్స్‌కు జరిగిన ఎన్నికల్లో తన ప్యానల్ విజయం సాధించిందని, ఇది వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సెమీ ఫైనల్స్ అంటూ మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోపరేటివ్ సొసైటీలో ఇప్పటికే లక్షలాది రూపాయల మేర అవినీతి జరిగిందని, అంటువంటి సంస్థలో తన వ్యక్తులను పెట్టి ఇబ్బందులు గురిచేయలేకే సదరు ఎన్నికలపై దృష్టి పెట్టలేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే సొసైటీలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఆయన విచారణ చేయించాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓట్లు నమోదు చేయాలి

అమలాపురం రూరల్: త్వరలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓట్ల నమోదుకు దరఖాస్తులు చాలా తక్కువగా వచ్చాయని, ఉపాధ్యాయులు ఓట్ల నమోదును వేగవంతం చేయాలని తహసీల్దార్ కిషోర్‌బాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓట్ల నమోదుకు సంబంధించి శనివారం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిషోర్‌బాబు మాట్లాడుతూ ఫారం–19 అప్లికేషన్లు చాలా తక్కువగా వస్తున్నాయని, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సోమవారం నాటికి అందచేయాలని కోరారు. డీఈఓ, డిప్యూటీ డీఈఓ కౌంటర్ సంతకాలు చేసి సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పల్లంరాజు, జిల్లా అదనపు కార్యదర్శి వేమన వీవీ సత్యనారాయణ, మండల ఆర్థిక కార్యదర్శి బాల నాగు గుప్తా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషోర్‌బాబు

చంద్రరావు కాపు ఉద్యమాలకు ఊపిరిలూదారు

అమలాపురం టౌన్: రాష్ట్ర కాపు రిజర్వేషన్ కమిటీ అధ్యక్షుడు నల్లా సూర్యచంద్రరావు కాపు ఉద్యమాలకు ఊపిరిలూదారని పలువురు కాపు నేతలు పేర్కొన్నారు. సూర్యచంద్రరావు 12వ వర్ధంతి కార్యక్రమాలు అమలాపురంలో శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక గడియారం స్తంభం సెంటరు, మహిపాలవీధి, నల్లా గార్డెన్స్ ప్రాంతాల్లో జరిగిన వర్ధంతి కార్యక్రమాల్లో పలువురు కాపు నాయకులు పాల్గొని ప్రసంగించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్, స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి తదితరులు సూర్యచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూర్యచంద్రరావు కుమారులు నల్లా అజయ్, సంజయ్, రాష్ట్ర కాపు ఉద్యమ నాయకుడు నల్లా పవన్‌కుమార్, రాష్ట్ర కాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్, వంటెద్దు వెంకన్నాయుడు, కల్వకొలను బాబి, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సూర్యచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి తదితరులు

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ రెండో వార్డులో లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ శనివారం ఉదయం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శివశంకర ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక 9వ వార్డులో సామాజిక పింఛన్లను స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గొలకోటి విజయలక్ష్మి, మాజీ కౌన్సిలర్లు తిక్కిరెడ్డి నేతాజీ, దేవరపల్లి శాంతికుమార్ తదితరుల పాల్గొన్నారు.

అల్లవరం: కోడూరుపాడు పంచాయతీలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పింఛన్లు అందజేశారు. మండలంలోని 9,418 పింఛన్లకు గాను 9,000 పింఛన్లు పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు.

ఉప్పలగుప్తం: మండల వ్యాప్తంగా 7,942 పింఛన్లకు గాను శనివారం 93 శాతం పింఛన్లు అందజేశామని ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం పట్టణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చిత్రకారుడు బాపూకు ఘన నివాళి

అమలాపురం టౌన్: చిత్రకారుడు బాపు గీసిన చిత్రాలు వాటిని చూస్తున్న వ్యక్తితో మాట్లాడుతున్నట్లుగా ఉంటాయని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అన్నారు. శ్రీశ్రీ కళా వేదిక, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక డాబా గార్డెన్స్‌లో శనివారం జరిగిన బాపు వర్ధంతి కార్యక్రమంలో నరసింహమూర్తి మాట్లాడారు. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో తొలుత బాపు చిత్రానికి కవులు, రచయితలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా చేతి వృత్తుల సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, కోళ్ల బ్రహ్మాజీ, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బాపు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

ప్రిన్సిపాల్ కోటిలింగం సేవలు అభినందనీయం

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవల కోటిలింగం సేవలు అభినందనీయమని డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈవో) వనుము సోమశేఖరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కోటిలింగానికి కళాశాలలో శనివారం జరిగిన వీడ్కోలు, సత్కార సభకు సోమశేఖరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ కడియం శిరీష అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సభలో పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ప్రిన్సిపాల్ కోటిలింగం సేవలను కొనియాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కోటిలింగం వృత్తి పట్ల అంకితభావంతో వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. చివరిగా ప్రిన్సిపాల్ కోటిలింగం, అన్నపూర్ణ దంపతులను కళాశాల తరపున డీఐఈవో సోమశేఖరరావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.


కోటిలింగం దంపతులను సత్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

దొరికిన పర్స్ అప్పగించి నిజాయతీ చాటుకున్నారు

అమలాపురం రూరల్: రోడ్డుపై దొరికిన పర్స్‌ను నిజాయితీగా పెద్దల సమక్షంలో బాధితుడికి అప్పగించి ఇద్దరు వ్యక్తులు తమ నిజాయతీ చాటుకున్నారు. కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామం గిడ్డివారిపేటకు చెందిన గిడ్డి సత్యప్రసాద్ విజయ్‌కుమార్(చంటి), కుండలేశ్వరం గ్రామానికి చెందిన గెద్దా భూషణంలు అమలాపురం రూరల్ మండలం కామనగరువు వస్తుండగా మార్గం మధ్యలో పర్స్ దొరికింది. దాంట్లో రూ.10 వేల నగదు, వివిధ బ్యాంకులకు సంబంధించిన ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డులు, గల్ఫ్ దేశానికి సంబంధించిన ఐడీ కార్డు, సేఫ్ ఆస్పత్రి ఓపీ కార్డు ఉన్నాయి. దాంట్లో ఉన్న కార్డుల ఆధారంగా సదరు పర్స్ అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన అయితాబత్తుల చినబాబుదిగా గుర్తించారు. పర్స్‌లో ఆయన చిరునామా లేకపోవడంతో సేఫ్ ఆస్పత్రి ఓపీ కార్డు చూసి ఆసుపత్రికి ఫోన్ చేసి బాధితుడి ఫోన్ నెంబర్ తెలుసుకుని సమాచారం అందించారు. సర్పంచ్ నక్కా అరుణ కుమారి, ఇమ్మిడివరప్పాడు, రోళ్లపాలెం గ్రామ సచివాలయాల గుమస్తాలు శ్రీను, రాజు సమక్షంలో శనివారం చినబాబుకు పర్స్‌ను అప్పగించారు. పర్స్‌ను అందించిన సత్యప్రసాద్ విజయకుమార్, భూషణంలకు చినబాబు కృతజ్ఞతలు తెలియజేశారు.


కామనగరువులో చినబాబుకు పర్స్ అప్పగిస్తున్న సత్యప్రసాద్, భూషణం

నిస్వార్థ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

యానాం: నిస్వార్థ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఎస్పీ రాజశేఖరన్ పేర్కొన్నారు. పోలీస్ శాఖలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఎస్ఐ తదితర హోదాల్లో పనిచేసిన పెద్దిరెడ్డి సత్యనారాయణ(సతీష్) ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పోలీస్ శాఖలో 37 ఏళ్ల పాటు విధి నిర్వహణే ధ్యేయంగా పనిచేసిన సత్యనారాయణ సేవలు సేవలు ప్రశంసనీయమైనవన్నారు. కొన్నేళ్ల క్రితం సంచలనం సృష్టించిన యానాం సబ్‌జైలు నుంచి పారిపోతున్న కరుడు గట్టిన ఖైదీలను ఎంతో ధైర్యంతో వెంటాడి పట్టుకుని అందరి ప్రశంసలు పొందారన్నారు. అనంతరం సతీష్ దంపతులను పోలీసు అధికారులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పురవీధుల్లో భారీ బాణసంచా కాల్పుల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, మురుగానందన్ తదితరులు పాల్గొన్నారు.


సతీష్ ఉద్యోగ విరమణ సత్కార సభలో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

ప్రమాదకరంగా పోలేకుర్రు రహదారి

తాళ్లరేవు: గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు రహదారులు ప్రమాదకరంగా మారాయి. మండల పరిధిలోని పోలేకుర్రు–పి.మల్లవరం రహదారి గోతులమయంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పోలేకుర్రు, పి.మల్లవరం సరిహద్దులో పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదభరితంగా తయారైంది. అదేవిధంగా మండలంలోని పలు ప్రాంతాల్లోని రహదారులపై నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథులు కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


పోలేకుర్రు-పి.మల్లవరం సరిహద్దులో ప్రమాదకరంగా మారిన గొయ్యి

ప్రాణాలు పోతున్నా పట్టింపేది?

ప్రమాదకర మలుపుపై అధికారుల శీతకన్ను

అల్లవరం: గోడి ఆంజనేయ స్వామి టెంపుల్ వద్ద ప్రధాన రహదారిలో ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. పేరూరు జాతీయ రహదారి నుంచి గోడిలంక వరకూ రోడ్డును విస్తరించారు. గోడి రైసుమిల్లు వద్ద రోడ్డు నిర్మాణంతో పాటు పంట కాలువపై కల్వర్టు నిర్మించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ ఇవేమీ పట్టించుకోకుండా రోడ్డు నిర్మించేసి చేతులు దులుపుకున్నారు. దీంతో కల్వర్ట్ లేక రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ఎదురుగా ఉన్న పంట కాలువలో పడిపోతున్నారు. ఇటీవలే ఎస్.రామేశ్వరం గ్రామానికి చెందిన చెక్కా వెర్రియ్య తన స్కూటర్‌తో సహా కాలువలో పడిపోయి మృతి చెందిన విషయం విదితమే. మూడు రోజుల తర్వాత స్థానికులు గుర్తించారు. ప్రమాదకర మలుపు వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడం, ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా కారణంగా ఓ నిండు ప్రాణం పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


గోడి రైసు మిల్లు వద్ద ప్రమాదకర మలుపు

రోళ్ల వెంకయ్యనాయుడు మృతికి సంతాపం


వెంకయ్యనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాళ్లరేవు: రావుగోపాలరావు సహచర నటుడు, సాంఘిక నాటకాల దర్శకుడు రోళ్ల వెంకయ్యనాయుడు మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. ఇటీవల మృతి చెందిన ఆయన సంతాప కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు, వాకపల్లి చిరంజీవి తదితరులు మాట్లాడుతూ కళా రంగానికి, కళాకారుల సంక్షేమానికి వెంకయ్యనాయుడు చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో టి.లక్ష్మణరావు, ధూళిపూడి బాబి, అత్తిలి బాబూరావు, పి.రామలక్ష్మి, గంజా సూరిబాబు, జవ్వాది తాతాజీ, వనిమిశెట్టి అప్పన్న, విళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరంగి అభయారణ్యం సందర్శన


కోరంగి అభయారణ్యాన్ని సందర్శించిన ట్రైనీ ఫారెస్ట్ సెక్షన్ అధికారులు

తాళ్లరేవు: కోరంగి అభయారణ్యాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ ట్రైనీ ఫారెస్ట్ సెక్షన్ అధికారులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ డివిజినల్ ఫారెస్ట్ అధికారి టి.అనూష, ఫారెస్ట్ రేంజర్ ఎస్ఏ స్ఆర్ వరప్రసాద్‌లు మడ అడవుల ప్రాముఖ్యత, హోప్ ఐలాండ్ విశిష్టత, ఎకో టూరిజం నిర్వహణ, అభయారణ్యంలోని వివిధ రకాల మొక్కలు, జంతువుల గురించి వారికి వివరించారు. అలాగే అభయారణ్యంలో సందర్శకుల కోసం ప్రతి నెలా చేపట్టే వివిధ కార్యక్రమాలను తెలియజేశారు. హోప్ ఐలాండ్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ఏవీ రమణమూర్తి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది ఉన్నారు.

రక్షణ గోడ నిర్మించాలని వినతి


ఎమ్మెల్యే అశోక్‌తో సమావేశమైన ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ రైతులు

యానాం: దరియాలతిప్పలో తమ సొసైటీకి చెందిన భూములు వరదల ఉధృతికి ముంపునకు గురవుతున్నాయని, రక్షణగోడ నిర్మించాలని కోరుతూ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ రైతులు విన్నవించుకున్నారు. శనివారం ఎమ్మెల్యే అశోక్ కార్యాలయానికి వచ్చి రైతులంతా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ ఇప్పటికే నిధులివ్వాలంటూ ఓఎన్‌జీసీ సంస్థను కోరామని, త్వరలోనే రక్షణ నిర్మించడానికి కృషి చేస్తానని ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు సబ్బతి శ్రీనివాస్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్ నూతన సభ్యులు

యానాం: యానాం పిల్లారాయ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అధ్యక్షతన మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేలూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా డీవీవీ సత్యనారాయణ, సెక్రటరీగా నల్లం సురేష్, ట్రెజరర్‌గా కనకాల నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా బెజవాడ నిరంజన్, గొల్లపల్లి వీర్రాజు, చైర్‌పర్సన్లుగా పులవర్తి వెంకటరమణమూర్తి, చింతలపూడి సత్యనారాయణ, మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా అరిశెట్టి రాజేష్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

నేడు లక్ష రుద్రాక్ష పూజ

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి వారికి శ్రావణ మాసం మాసశివరాత్రి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం లక్ష రుద్రాక్ష పూజా మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వారణాసి నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలతో జరిగే ఈ కార్యక్రమంలో రూ.250 చెల్లించి భక్తులు గోత్రనామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పూజలో పాల్గొన్న భక్తులకు రుద్రాక్షలు ప్రసాదంగా ఇస్తామన్నారు.